క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం

సీటీఆర్ఐ: శ్రీ ఉమా మార్కండేయేశ్వరస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. స్వామి, పార్వతీ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. .

ప్రత్యేక ఉపవాస ప్రార్థన

కడియం: స్థానిక హైస్కూల్ వెనుక గల షారోన్ దైవిక స్వస్థత శాలలో శనివారం ప్రత్యేక ఉపవాస ప్రార్థన నిర్వహించారు. నిర్వాహకుడు డాక్టర్ దేవరపల్లి రత్నరాజు మాట్లాడుతూ బైబిలులో ఉన్న అనేక మంది భక్తుల విజయగాథలను వివరించారు. శాల నిర్వాహకురాలు దేవరపల్లి సరోజిని పుట్టిన రోజు సందర్భంగా ప్రార్థనలు చేశారు.

ఐఎంఏ సమావేశం

కంబాలచెరువు: టీచర్ ఎమ్మెల్సీ మాదిరిగాల వైద్య ఎమ్మెల్సీని ప్రకటించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేసీ నాయుడు అన్నారు స్థానిక చెరుకూరి కల్యాణ మండపంలో శనివారం రాత్రి ఐఎంఏ సమావేశం జరిగింది. కేసీ నాయుడు మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల్లో రాయితీ ఇవ్వాలని, టాక్స్‌లను తగ్గించాలన్నారు. ఐఎంఏ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు హేమలత, నగర అధ్యక్షులు గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ తదితరులు

కడియం: రాష్ట్రంలో ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని వేమగిరి గట్టు, జక్కంపూడి నగర్ ప్రాంతాల్లో రూ.87.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు.

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కాలుష్య రహిత పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛత – మన బాధ్యత కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆ దిశగా ప్రభుత్వ యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని మంత్రి వేణు అన్నారు. ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని 19వ డివిజన్ కొండావారి వీధి నుంచి స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

19వ డివిజన్‌లో గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో సుమారు వంద మంది మహిళలు,యువత వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. 16వ డివిజన్ బాలాజీ పేట సెంటర్‌లో గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో 200 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన పాప్పి, అంజిబాబు, గోపి, కర్రి రాజేష్, జయలక్ష్మి, ఈపి శివగౌరి, సూరిబాబు, నాని తదితరులుకు మంత్రి వేణు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

కడియం: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియం మండలం పరిధిలోని లబ్ధిదారులకు శనివారం వైఎస్సార్ చేయూత నమూనా చెక్కును పంపిణీ చేశారు. మండలంలో 4,154 మందికి రూ.7,78,87,500 జమ చేయడం జరిగిందన్నారు. మొత్తం నాలుగు విడతలుగా 15,444 మందికి రూ.28.86 కోట్లు అందించామని తెలిపారు.

అక్కచెల్లెమ్మలకు భరోసా

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా కల్పించారని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. నగరపాలక సంస్థలోని రూరల్ నియోజకవర్గ డివిజన్ల పరిధిలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత కార్యక్రమాన్ని ఇన్నీసుపేట బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ 16 సచివాలయాల పరిధిలోని 2,284 మంది లబ్ధిదారులకు రూ.428.25 లక్షలను వైఎస్సార్ చేయూత పథకం కింద వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాల పంపిణీ



పురోహితులకు పట్టువస్త్రాలు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ జన్మదినం సందర్భంగా ఆయన కుమారుడు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శనివారం ఇన్నీసుపేటలోని మహాకాళేశ్వరీ సమేత మహాకాళేశ్వరాలయంలో పురోహితులకు పట్టువస్త్రాలు పంపిణీ చేశారు. అలాగే 36వ డివిజన్‌లో నివసిస్తున్న సతీష్ అనే దివ్యాంగుడికి ట్రైసైకిల్ పంపిణీ చేశారు.

మహిళా పోలీసులకు సన్మానం

కంబాలచెరువు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులను సన్మానించారు. డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ విధులను నిర్వర్తిస్తూ, కుటుంబాన్ని ముందుకు నడిపిస్తూ మహిళలు సమాజంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు బాలమురళీకృష్ణ, బాలశౌరి, కానిస్టేబుళ్లు అర్జున్, లోవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల దిష్టిబొమ్మ దహనం



కడియం దేవీచౌక్ సెంటర్‌లో ఎమ్మెల్యే గోరంట్ల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ నాయకులు

కడియం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. స్థానిక దేవీచౌక్ సెంటర్‌లో రూరల్ బీసీ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బుచ్చయ్య వ్యాఖ్యలపై నిరసన తెలిపారు.

ఎస్‌కేఆర్‌లో గ్రీన్‌హౌస్

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం గ్రీన్ హౌస్ డెవలప్‌మెంట్ కార్యక్రమం చేపట్టారు. కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.సాయి సునీత, ఇండస్ట్రియలిస్ట్, సీపీడీసీ మెంబర్ జి.మణికుమార్ ఇందుకు అవసరమైన వివిధ రకాల మొక్కలను అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి మాట్లాడుతూ ప్రతి కళాశాలలోనూ గ్రీన్‌హౌస్ ఉండాలన్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేని మొక్కలను దానిలో పెంచుతామన్నారు.